తీరని ఆధార్ కష్టాలు



రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో వేచి ఉన్న మహిళలు

- అన్నింటికీ ఆధార్ ఆధారంగా మారిన వైనం
- తప్పులతో అందని ప్రభుత్వ పథకాలు
- ఆధార్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నేడు అన్నింటింటికీ ఆధార్ కార్డు ఆధారంగా మారింది. ప్రభుత్వ పథకాలు అందాలన్నా, బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలన్నా, ఏదైనా సర్టిఫికెట్ తీసుకోవాల్నా ఆధార్ కార్డు తప్పని సరి. ఆధార్‌లో తప్పులు ఉండడంతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. దీంతో ప్రజలు ఆధార్ సెంటర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. రేణిగుంట మండలానికి సంబంధించి రెండు సెంటర్లు మాత్రమే ఉండడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

రేణిగుంట: మండలంలో 19 పంచాయతీలు వున్నాయి. సుమారు 60 వేలకు పైగా జానాభా వుంది. వీరికి సేవలు అందించేందుకు రెండు ఆధార్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం అన్నింటికీ ఆధార్ ఆధారం కావడంతో తప్పులను సరిచేసుకోవడం, ఫింగర్ ప్రింట్ అప్‌డేట్ చేయించుకునేందుకు ప్రజలు ఆధార్ సెంటర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. సర్వర్లు పనిచేయకపోవడం ఒక కారణమైతే, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు ఆధార్ పనులు

మండలంలోని గాజుల మండ్యం, రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సెంటర్లు ఉన్నాయి. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లకే ఆధార్ అప్‌డేట్ పనులు అప్పగించారు. వారు సచివాలయ విధులతోపాటు ఆధార్ అప్‌డేట్ పనులు చేయలేకపోతున్నారు. అందులోనూ ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలు జరుగుతుండడంతో వారు కార్యాలయంలో ఉండడం లేదు. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ అప్‌డేట్ కోసం వస్తే టోకెన్ ఇచ్చి రెండు లేదా మూడు రోజుల తర్వాత రమ్మని చెబుతున్నారని, తీరా వారు చెప్పిన సమయానికి వస్తే సర్వర్లు పని చేయడం లేదని, లేదా సచివాలయ పనులు ఉన్నాయని చెబుతూ పంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మరిన్ని ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వేరొకరికి బాధ్యతలు అప్పగించాం

ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలు జరుగుతున్నాయి. దీంతో వారు కౌన్సెలింగుకు వెళుతున్నారు. దీంతో ఆధార్ అప్‌డేట్ పనులు ఆలస్యం అవుతున్నాయి. ప్రజలు ఇబ్బందులను గుర్తించి డిజిటల్ అసిస్టెంట్ల స్థానంలో వేరొకరికి బాధ్యతలు అప్పగించాం. త్వరలోనే అన్ని సమస్యలూ తీరుతాయి.

–ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు

క్లుప్తంగా

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూథితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

11న మెగా జాబ్‌మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్ లోకనాథం, ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. 11 బహుళ జాతీయ కంపెనీల్లో 400లకుపైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. సంబంధిత లింకులో ఈ నెల 10వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అన్ని కంపెనీలకు అప్లై చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. మరన్ని వివరాలకు 7989509540, 8919889609 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న కత్తిధర్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య డిమాండ్ చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పలువురికి ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 252, 253, 254లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలాల కోసం దళితులు రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. దళితులకు ఒక్కొక్కరికి 3 సెంట్ల స్థలాలను ఇవ్వాలన్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేసి, తిరుపతి కలెక్టరు ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ పద్ధతిలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు ఈ నెల 14వ తేదీ సాయంత్రం లోపు తమ హెవీ డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డు, దరఖాస్తును డిపో మేనేజరు కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959297947, 9063774464 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం



టైలరింగ్ కిట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రేణిగుంట: రాస్ జన శిక్షణ సంస్థాన్, బాలాజీ బాల వికాస్ చైల్డ్ ఫండ్ సౌజన్యంతో రేణిగుంట మండలంలోని ఎల్లమండ్యం గ్రామంలో సోమవారం మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 మంది మహిళలకు టైలరింగ్ కిట్లను పంపిణీ చేశారు. జన శిక్షణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడాలన్న ఉద్దేశంతో అనేక రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల కోసం టైలరింగ్, అర్యవర్క్, బ్యూటీషన్, కంప్యూటర్, కారు, ఆటో డ్రైవింగ్ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ రెండు నెలలు కొనసాగుతుందన్నారు. ఏ గ్రామంలోనైనా 20 మంది మహిళలు ఒక బ్యాచ్‌గా ఏర్పడితే వారు కోరుకున్న కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. అలాగే ఆ కోర్సుకు సంబంధించిన వస్తువులను ఉచితంగా అందజేస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఎన్‌ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాస్ చైల్డ్ ఫండ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, జన శిక్షణ సంస్థాన్ కోఆర్డినేటర్ సుధాకర్, ఇన్‌స్ట్రక్టర తేజోవతి పాల్గొనారు.

నేడు మండల సమావేశం

ఏర్పేడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సౌభాగ్యం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం అధికారులతో కలిసి ప్రజాసమస్యల ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించి, వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఏవో షణ్ముగం, ఏపీఎం మునెయ్య, ఏఈ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

వైభవంగా మునీశ్వర విగ్రహ ప్రతిష్ట





విగ్రహ ప్రతిష్టకు భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, మునీశ్వర విగ్రహ ప్రతిష్ట చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ చెల్లాతమ్మ ఆలయంలో మునీశ్వర విగ్రహ ప్రతిష్ట సోమవారం అంగరంగ వైభవంగా నిరహించారు. ఆలయ అర్చకులు జానకిరామన్ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు గణపతి పూజతో మొదలు పెట్టి ప్రత్యేక హోమం చేశారు. తదుపరి మునీశ్వర స్వామి, సప్త కన్నికలు, పెరియాండార్ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం పూర్ణాహుతి, మహా దీపారాధన చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం అన్నదానం చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



కమిషనర్ గిరికుమార్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పిలుపునిచ్చారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గిరికుమార్‌ను కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని, ప్రజల సొమ్మును కార్పొరేట్లకు పంచిపెడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. 9న జరిగే సార్వత్రిక సమ్మెలో సంయుక్త కిసాన్ మోర్చా, అన్ని కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున్, ప్రజానాట్యమండలి జిలా అధ్యక్షురాలు చారుశీల, మున్సిపల్ కార్మికులు హరి, జాను, ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్ధన్ పాల్గొన్నారు.

పాఠశాల విలీనాన్ని ఆపాలని వినతి

రేణిగుంట: తమ గ్రామంలో ఉన్న పాఠశాలను పక్క గ్రామంలోని పాఠశాలలో విలీనం చేయడాన్ని ఆపాలని రేణిగుంట మండలం తండ్లం గ్రామస్తుల తోపాటు ఎంపీటీసీ శశికిరణ్‌రెడ్డి కోరారు. వారు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి రూరల్ పాడిపేట గ్రామ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో నివసిస్తున్న సుమారు 30 మంది పేద మధ్య తరగతి కుటుంబాల పిల్లలు తండ్లం గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూలులో చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌ను మూసివేసి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క పంచాయతీ విప్పమాను పట్టెడ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. రెండు గ్రామాల మధ్య రవాణా సౌకర్యం కూడా లేదన్నారు. పిల్లలు బడికి వెళ్లి రావడానికి ఆరు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని తెలిపారు. వారి కుటుంబ సభ్యులు సొంత వాహనాలలో తీసుకొని వెళ్లి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని మూసివేసిన మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌ను పునఃప్రారంభించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



మహిళలకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

ఏర్పేడు: మండల వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ సోమవారం చెల్లూరులో పర్యటించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో విరేచనాలు ప్రమాదకరమని, రోజుకు మూడుసార్ల కంటే ఎక్కువగా విరేచనాలు అయితే ఆలస్యం చేయకుండా డాక్టర్‌కు చూపించాలన్నారు. జింక్ మాత్రలు, ఓఆర్‌ఎస్ ద్రావణం ద్వారా విరేచనాలను అరికట్టవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డయేరియా వచ్చే అవకాశం ఉందని, నీటిని కాచి చల్లార్చి తాగాలని తెలిపారు. పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కస్తూరి, ఆరోగ్య కార్యకర్త శారద, కవిత, ఆశా కార్యకర్త రేవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా ధ్వజావరోహణం



ఊరేగుతున్న అమ్మవారు



ధ్వజావరోహణం చేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఆగమోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు. ఆలయ పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభానికి కట్టిన చీరలను కిందకు దింపారు. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవ మూర్తులు ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి

ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడులోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ అధికారిణి జ్యోత్స్న, ఏర్పేడు హాస్టల్ వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి: ఆర్డీవో

హాస్టల్‌లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో డివిజన్‌లోని హాస్టల్ వార్డెన్లతో సమావేశమయ్యారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ప్రతిరోజూ వార్డెన్ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తూతూమంత్రంగా సుపరిపాలనలో తొలి అడుగు

సత్యవేడు: మండలంలోని రాజులకండ్రిగలో సోమవారం టీడీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమమంతా ఆయనను సత్కారాలతోనే సరిపెట్టారు. తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలిపేందుకు అరుంధతి వాడ, గిరిజన కాలనీ వాసులు వేచి చూసినా నాయకులు రాకపోవడంతో నిరాశ చెందారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత, వీకేఎన్ బాషా, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, చికెన్ చిన్నా(మురళి), మోహన్, సుందరరామిరెడ్డి, ఎం.సునీల్ కుమార్, బాలమురళీకృష్ణ, శశి తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజలు



ఆలయ కార్యనిర్వాహక అధికారి లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణ అధికారి లత తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరుడు, వాల్మీకేశ్వర స్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

హాస్పిటల్ అభివృద్ధికి ఆర్థిక సాయం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పీహెచ్‌సీ అభివృద్ధికి అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు భరణి బాస్ రూ.5 వేలు అందజేశారు. నగదును వైద్యాధికారి ప్రశాంత్‌కు ఇచ్చారు. రానున్న రోజుల్లో మరికొంత మంది దాతల ద్వారా హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

బోరు మోటారుకు మరమ్మతులు



తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్, కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీవీకండ్రిగ గ్రామంలోని తాగునీటి బోరు మోటారుకు సర్పంచ్ యనమల కోటమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు యనమల ప్రసాద్‌పాల్ మరమ్మతులు చేయించారు. తాగునీటి బోరు మోటారు చెడిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. దీనిపై స్పందించిన సర్పంచ్ మరమ్మతులు చేయించటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ఎల్‌ఈడీ లైట్ల వితరణ



క్రీడాకారులకు ఎల్‌ఈడీ లైట్లు అందజేస్తున్న వినోద్ యాదవ్

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం దళితవాడకు చెందిన యువత వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకుని రోజూ సాధన చేస్తున్నారు. రాత్రిళ్లు సాధన చేయడానికి వీలుగా ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్‌ను కోరారు. దీంతో ఆయన రూ.15 వేలు వెచ్చించి ఎల్‌ఈడీ ఫోకస్ లైట్లను అందజేశారు. వినోద్ యాదవ్‌కు యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలో సత్యవేడుకు ప్రాధాన్యం

వరదయ్యపాళెం: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విజన్ యాక్షన్ ప్లాన్‌లో సత్యవేడు అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన యాక్షన్ ప్లాన్ సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై నివేదిక అందజేశారు.

నేడు వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు



వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌కు ఘన నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేసి పంచిపెడతామన్నారు. తర్వాత పేదలకు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, ఆవుల శ్రీనివాసులు, కంఠా ఉదయ్‌కుమార్, పఠాన్ ఫరీద్, జాకబ్, అంకయ్య పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని కూడలి వేడకలు నిర్వహించి, పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

వరదయ్యపాళెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం సత్యవేడు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల కేంద్రాల వరకు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాటి వైఎస్సార్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు జరిగిన మేలును వివరించాలని సూచించారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

తొట్టంబేడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోగిల సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం, కేక్ కటింగ్, అన్నదానం కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలి



ట్యాంకు వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశిస్తున్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామాల్లో తాగునీటిని అందించే నీటి ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదేశించారు. ఆమె సోమవారం వెస్టువరత్తూరు గ్రామంలోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కలుషిత నీటిని తాగడం వల్ల టైఫాయిడ్ బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. క్రమం తప్పకుండా తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేస్తే వ్యాధుల బారిన పడే అవసరం ఉండదని తెలిపారు. అదే విధంగా గ్రామంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు చేరకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల కారణంగా జ్వరాల బారిన పడుతామన్నారు. ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ, ఫస్టు ఎయిడ్ బాక్స్ ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో మునెయ్య, ఏపీఎం దేవరి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడు సమీపంలో మలిమేలు కండ్రిగ పుత్తూరు–చెన్నై హైవేపై సోమవారం వ్యక్తిని కారు ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని ట్రిపుల్ కేన్‌కు చెందిన భక్తులు కుటుంబంతో సహా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో బైట కొడియంబేడు సమీపంలో నాగలాపురం ఇందిరా గాంధీనగర్‌కు చెందిన కన్నయ్య(52) రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా కారు ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. కన్నయ్య రెండు కాళ్లు విరిగాయి. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై ఆస్పత్రికి తరలించారు. కన్నయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

నడిరోడ్డుపైనే బోరు పాయింట్



హై స్కూల్ ఎదురుగా ఉన్న కేసింగ్ పైపు

రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ముందు నడి రోడ్డుపైనే పంచాయతీ పాలకులు బాలికల పాఠశాల ఎదుట రెండు నెలల క్రితం పంచాయతీ పాలకులు రూ.1.20 లక్షలు ఖర్చుపెట్టి బోరు వేశారు. నీరు పడకపోవడంతో దాన్ని అలాగే వదిలేశారు. భూమి నుంచి రెండు అడుగుల ఎత్తులో డమ్మీ వేసి వదిలేశారు. రోడ్డు గుండానే బాలుర పాఠశాల, ఎమ్మార్సీ, సీఆర్‌ఎస్, తహసీల్దార్ కార్యాలయం. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో నడిరోడ్డులో బోరు పాయింట్ ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బోరుకు వేసిన డమ్మీని భూమి మట్టానికి ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.